క్లుప్తంగా

మహిళా కండక్టర్‌ను దుర్భాషలాడిన యువకుడిపై కేసు

కంకిపాడు: విధి నిర్వహణలో ఉన్న మహిళా కండక్టర్‌ను దుర్భాషలాడిన యువకుడిపై స్థానిక పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్‌ఐ డి.సందీప్ తెలిపిన కథనం మేరకు... ఉయ్యూరు నుంచి విజయవాడ వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు రన్నింగ్‌లో ఉండగా మద్యం తాగి ఓ యువకుడు బస్సు ఎక్కాడు. అదేమని ప్రశ్నించిన మహిళా కండక్టర్‌పై దురుసుగా ప్రవర్తించి దుర్భాషలాడాడు. మహిళా కండక్టర్ శ్రీలత ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. దౌర్జన్యానికి పాల్పడ్డ యువకుడు కంకిపాడు పట్టణానికి చెందిన షేక్ జానూ సాహెబ్‌గా గుర్తించారు.

అమ్మవారి చీరల వేలం

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 19, 26 తేదీల్లో అమ్మవారి చీరల బహిరంగ వేలం నిర్వహిస్తున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి బి.గంగాధర్‌రావు తెలిపారు. పార్వతీదేవి అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలు ఆలయ ప్రాంగణంలో 19, 26 తేదీల్లో వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు. వేలం పాటలో భక్తులు పాల్గొనాలని కోరారు.

వృద్ధుడు అదృశ్యంపై కేసు

పెనమలూరు: వృద్ధుడు అదృశ్యంపై స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని గోసాల గ్రామ పరిధిలోని ఈదులడొంక ప్రాంతానికి చెందిన బెజవాడ బాబూరావు (85) ఈ నెల 15వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు స్థానికంగా విచారించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో బాబూరావు కుమారుడు లోకేశ్వరరావు పోలీసులను ఆశ్రయించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

శ్రీనగర్ కరకట్ట ప్రాంతానికి చెందిన...

వ్యక్తి అదృశ్యం ఘటనపై పెనమలూరు పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు...తాడిగడప శ్రీనగర్ కట్ట ప్రాంతానికి చెందిన మురాల కోటేశ్వరరావు (42) ఆదివారం తెల్లవారుజామున ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు స్థానికంగా విచారించినా ఆచూకీ లభ్యం కాలేదు. కోటేశ్వరరావు కుమారుడు వీరబాబు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేశారు.

350 మందికి వైద్య పరీక్షలు



కంకిపాడు: ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని వక్తలు సూచించారు. కానూరు టాప్‌స్టార్ హాస్పిటల్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కంకిపాడు సహకారంతో పంచాయతీ కార్యాలయంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 350 రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మధుమేహం, బీపీ, ఈసీజీ, ఎకో, ఇతర సాధారణ పరీక్షలు చేసి మందులు అందించారు. సీజనల్ వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ బాకీ రమణ, క్లబ్ అధ్యక్షుడు వన్నాల శివరామకృష్ణ, ప్రతినిధులు బండి జ్యోతి, కోమటి భారతి, చవట శంకర్‌రావు, మద్దుల గోవిందరావు, పి. రాజా తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శీతలాదేవి పూజా మహోత్సవాలు

కంకిపాడు: పట్టణంలో వేంచేసి ఉన్న శీతలాదేవి పూజా మహోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. మేళతాళాలు, డప్పు వాయిద్యాలతో భక్తులు శీతలాదేవిని దర్శించుకుని చద్దిని నైవేద్యంగా సమర్పించారు. పసుపు, కుంకుమలు అందించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. పాత పీహెచ్‌సీ రోడ్డులో కొలువైన శీతలాదేవికి లోకకల్యాణార్థం శ్రావణమాసం పురస్కరించుకుని భక్తులు హోమాలు, అభిషేకాలు చేయించారు. భక్తులతో పట్టణంలో కోలాహలం నెలకొంది.

నేడు జెడ్పీ హైస్కూల్లో భోజనశాల ప్రారంభం

గన్నవరం:మండలంలోని దావాజిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దాతల సహకారంతో నూతనంగా నిర్మించిన భోజనశాలను సోమవారం ప్రారంభించనున్నారు. గ్రామస్తులు, పాఠశాల ఉపాధ్యాయుల విజ్ఞప్తి మేరకు బుద్ధవరం గ్రామానికి చెందిన దాత మాగంటి మురళీ భోజనశాల నిర్మాణానికి ముందుకు వచ్చారు. సుమారు రూ. 20 లక్షల వ్యయంతో ఈ భోజనశాలను నిర్మించారు. దీనికి అనుసంధానంగా మధ్యాహ్న భోజనం సిద్ధం చేసేందుకు వంటశాలను కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. నూతన భోజనశాలను ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు చేతుల మీదుగా ప్రారంభించనున్నారు.

నేడు ప్రజా వేదిక

విజయవాడరూరల్: ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం నిర్వహించే ప్రజా వేదిక కార్యక్రమం సోమవారం కార్యాలయంలో నిర్వహిస్తామని ఎంపీడీఓ బి.భార్గవి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై వినతులను అందజేయాలని కోరారు. రెవెన్యూకు సంబంధించిన ప్రజా సమస్యలను అందజేయాలని తహసీల్దారు బి.సుగుణ ఒక ప్రకటనలో తెలిపారు.

వంద అడుగుల రోడ్డులో మృత్యు ఘంటికలు

- తరచుగా ప్రమాదాలు సంభవిస్తున్న వైనం
- రాత్రి సమయాల్లో మరింత ఎక్కువ
- భయాందోళనలో వాహనదారులు



కానూరు 100 అడుగుల రోడ్డు పై పార్కింగ్ చేసిన భారీ వాహనాలు

పెనమలూరు: ఇష్టానుసారం వాహనాల పార్కింగ్‌తో జాతీయ రహదారిపై మృత్యుఘంటికలు మోగుతున్నాయి. పట్టించుకోవాల్సిన పోలీసులు ప్రేక్షకపాత్ర వహించడంతో నిత్యం ప్రమాదాలు సంభవిస్తున్నాయి. కానూరు వంద అడుగుల రోడ్డులో తరచూ జరుగుతున్న ప్రమాదాలతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఈ రహదారి భారీ వాహనాల పార్కింగ్‌కు నిలయంగా మారింది. బారులుగా రోడ్డుపై వాహనాలు నిలిపి వేయటంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే 100 అడుగుల రోడ్డులో వాహనాలు నిలుపుతున్నా పోలీసులు పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి నుంచి ఏలూరు జాతీయ రహదారికి లింకు రోడ్డుగా కానూరు 100 అడుగుల రోడ్డు ఉంది. తాడగడప జంక్షన్ నుంచి ఎనికేపాడు వరకు రోడ్డు దాదాపు 4 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. ఈ రోడ్డు పై నిత్యం వాహనాల రాకపోకలతో విపరీతమైన ట్రాఫిక్ ఉంటుంది. కాలేజీలు, అపార్టుమెంట్‌లు, కల్యాణ మండపాలు ఈ రోడ్డులో ఉన్నాయి. అయితే ఈ రోడ్డు పై భారీ వాహనాలు బారులుతీరి రోడ్డు పై అక్రమ పార్కింగ్ చేస్తున్నారు. దాదాపు కిలోమీటరు మేర భారీ వాహనాలు రోడ్డు పక్కనే పార్కింగ్ చేయటంతో రాకపోకలకు తీవ్ర సమస్యలు తలెత్తుతున్నాయి. రాత్రి సమయాల్లో వాహనదారులు రోడ్డుపై ఉన్న లారీలను వెనుక నుంచి ఢీ కొట్టి తీవ్రంగా గాయపడుతున్నారు. ఈ రోడ్డులో సెంట్రల్ లైటింగ్ కూడా సక్రమంగా వెలగటం లేదు. బీట్‌లో ఉన్న పోలీసులు అక్రమ పార్కింగ్ చేసిన లారీల వద్ద వసూళ్లు చేసుకుంటున్నారే తప్పా చర్యలు తీసుకోవటం లేదని ఆరోపణలు వినబడుతున్నాయి. ఇప్పటికైనా పోలీసులు స్పందించి తమ ప్రాణాలు కాపాడాలని వాహనదారులు కోరుతున్నారు.

స్పీడ్ బ్రేకర్లతో ప్రమాదాలు...

ఇటీవల సీఎం చంద్రబాబునాయుడు 100 అడుగుల రోడ్డులో ఫంక్షన్‌కు వచ్చిన సమయంలో డివైడర్ కటింగ్‌లు ఏర్పాటు చేశారు. అయితే డివైడర్ కటింగ్‌ల వద్ద స్పీడ్‌బ్రేకర్లు పెట్టారు. కనీసం స్పీడ్ బ్రేకర్లు ఉన్నట్లు ఎటువంటి హెచ్చరిక బోర్డులు కానీ, తెల్లని లైన్లు గానీ పెట్టలేదు. దీంతో వాహనదారులు దగ్గరకు వచ్చేవరకు స్పీడ్ బ్రేకర్లు కనబడటం లేదు. దీంతో వాహనదారులు స్పీడ్‌బ్రేకర్లపై వాహనాలు దూకించి ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లు తొలగించాలని కోరుతున్నారు.

జ్వరాలతో జనం విలవిల..

- కిటకిటలాడుతున్న ఆస్పత్రులు
- పదుల సంఖ్యలో జ్వరపీడితులు



హనుమాన్‌జంక్షన్‌లోని జ్వర పీడితులతో కిటకిటలాడుతున్న ఓ ప్రైవేట్ ఆస్పత్రి

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలంలో గత నెల రోజులుగా వైరల్ జ్వరాలు జనాలను బెంబేలెత్తిస్తున్నాయి. పలు గ్రామాల్లో జ్వర పీడితులు రోజురోజుకూ పెరుగుతున్నారు. దీంతో ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. ఇంట్లో ఒకరు జ్వరం బారిన పడితే ఆ ఇల్లంతా జర్వాలు వ్యాపిస్తున్నాయి. కనీసం నాలుగైదు రోజులు హైటెంపరేచర్‌తో జ్వరంతో పాటు తీవ్రంగా ఆలసట, నీరసంతో రోగులు బాధపడుతున్నారు. అంతే కాక జర్వం తగ్గిన వారం, పది రోజుల వరకు కండరాలు, నడుము నొప్పులు తగ్గటం లేదు. ఈ తరహా లక్షణాలతో రోగులు పదుల సంఖ్యలో కనిపిస్తున్నారు. వాతావరణ మార్పులు, పారిశుద్ధ్య లోపం, దోమల వ్యాప్తితో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. మండలంలోని కొత్తపల్లి, తారకరామ కాలనీ, కె.సీతారామపురం, బండారుగూడెం, వీరవల్లి, బిళ్లనపల్లి, మల్లవల్లి గ్రామాల్లో వైరల్ జ్వరాల బాధితులు అధికంగా ఉన్నారు. బాపులపాడు, వీరవల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది ఇప్పటికే ఇంటింటి ఫీవర్ సర్వేలు నిర్వహిస్తున్నారు. దీనికి తోడు జ్వరం లక్షణాలు కలిగిన రోగులను గుర్తించి రక్త పరీక్షలు చేస్తున్నారు.

జోరుగా రాఖీల విక్రయాలు



కంకిపాడు: రాఖీల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఆత్మీయత, అనుబంధాలకు ప్రతీక అయిన రాఖీ పండుగ సోమవారం కావటంతో పట్టణంలోని దుకాణ సముదాయాల వద్ద రాఖీల విక్రయాలు చేపట్టారు. విభిన్న ఆకృతుల్లో ఉన్న రాఖీలను తమ సోదరుల కోసం కొనుగోలు చేసేందుకు సోదరీమణులు దుకాణాల వద్ద బారులు తీరుతున్నారు. కొనుగోలుదారులతో సందడి వాతావరణం నెలకొంది.

పోలీస్‌స్టేషన్ ఆవరణలో శ్రమదానం



గన్నవరం:స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆదివారం పోలీస్ అధికారులు, సిబ్బంది శ్రమదానం చేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పోలీస్‌స్టేషన్ ఎదుట దట్టంగా పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. దీంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొనడంతో పాటు దోమల ఉద్ధృతి పెరిగింది. దీంతో ఎస్‌ఐ శివప్రసాద్ నేతృత్వంలో హెడ్‌కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్ పిచ్చిమొక్కలను తొలగించారు. చెత్త చెదారం తొలగించి శుభ్రం చేశారు. పరిసరాల శుభ్రతను ప్రతిఒక్కరూ పాటించాలని కోరారు.

విద్యార్థులకు చిత్రలేఖనంలో శిక్షణ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు చిత్రలేఖనంలో శిక్షణ కార్యక్రమం జరిగింది. డ్రాయిగ్ టీచర్ ఎం.దుర్గాభవాని విద్యార్థులకు బొమ్మలు గీయడంలో మెలకువలు నేర్పించారు. అనంతరం పిల్లలకు కథలు చెప్పడం, చదివించడం చేశారు. శిక్షణ కార్యక్రమంలో 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారిణి కె రమాదేవి మాట్లాడుతూ ఠాగూర్ గ్రంథాలయంలో ప్రతీ ఆదివారం చిత్రలేఖనంలో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. బాలల ఊహాలోకం చాలా గొప్పగా ఉంటుందని, వారిలోని సృజనాత్మక శక్తిని వెలికితీసేందుకు శిక్షణ కార్యక్రమం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఔత్సాహిక విద్యార్థులు శిక్షణలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ



క్యూలో వేచి ఉన్న భక్తులు

- ఎండ తీవ్రతతో ఇబ్బందులు
- భక్తులకు మజ్జిగ వంపిణీ



కనకదుర్గ అమ్మవారు



మెట్ల పూజ సేవలో..



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వరుస సెలవులు, నూతన వధూవరులు, వారి కుటుంబ సభ్యులతో పాటు సాధారణ భక్తులు అమ్మవారి దర్శనానికి భారీగా తరలివచ్చారు. ఇంద్రకీలాద్రిపై పవిత్రోత్సవాల నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ అధికంగా కనిపించింది. పవిత్రోత్సవాలు కావడంతో ఆదివారం ఉదయం 8.25 గంటలకు అమ్మవారి దర్శనం ప్రారంభమైంది. అయితే ఇతర ప్రాంతాల నుంచి ఇంద్రకీలాద్రికి విచ్చేసిన భక్తులు తెల్లవారుజాము నుంచే క్యూలైన్‌లో వేచి ఉన్నారు. అమ్మవారి పూజా కార్యక్రమాల అనంతరం దర్శనాలు ప్రారంభం కాగా, మధ్యాహ్నం 3 గంటల వరకు రద్దీ కొనసాగింది.

రద్దీ దృష్ట్యా ప్రత్యేక ఏర్పాట్లు

ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన భక్తులు ముఖ్యంగా జంట నగరాలైన హైదరాబాద్, సికింద్రాబాద్‌తో పాటు వైజాగ్, తిరుపతి వంటి మహానగరాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శనానికి తరలివచ్చారు. మధ్యాహ్నం 12 గంటలకు ఘాట్‌రోడ్డులోని ఓం టర్నింగ్ వరకు, ఇటు మహా మండపం 5వ అంతస్తు వరకు సర్వ దర్శనంతో పాటు రూ.100, రూ. 300 టికెటు క్యూలైన్లు కిటకిటలాడుతూ కనిపించాయి. మహా నివేదన అనంతరం భక్తులకు అమ్మవారి దర్శనంలో ఎటువంటి ఇబ్బంది కలుగకుండా ఆలయ ఈవో కె.ఎస్. రామరావు ఏర్పాట్లు చేశారు. క్యూ లైన్లు వేగంగా ముందుకు కదిలేలా అదనపు సిబ్బందిని ఏర్పాటు చేయడంతో పాటు భక్తులు ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు మజ్జిగ పంపిణీని ఆలయ ప్రాంగణంలో ప్రారంభించారు. లక్ష్మీ గణపతి విగ్రహం వద్ద మజ్జిగ వితరణ చేయడంతో పాటు క్యూలైన్‌లో ఉన్న భక్తులకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. మూడో శుక్రవారమైన 23వ తేదీన అమ్మవారి ఆలయంలో నిర్వహించే సామూహిక వరలక్ష్మి వ్రతాలకు ఆదివారం దరఖాస్తులను పంపిణీ చేశారు. నాల్గవ అంతస్తులోని పూజల విభాగంలో ఈ దరఖాస్తులను అందజేస్తుండగా, పెద్ద సంఖ్యలో మహిళలు దరఖాస్తులను స్వీకరించారు. రెండు షిఫ్టులలో ఆలయ అధికారులు ఈ దరఖాస్తులను అందజేశారు. ఆధార్ కార్డు, రేషన్‌కార్డు జిరాక్స్‌లను తీసుకువచ్చిన వారికి దరఖాస్తును అందిస్తున్నామన్నారు.

దుర్గమ్మ నిత్యాన్నదానానికి విరాళాలు అందజేత



ఇంద్రకీలాద్రి:దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి పలువురు భక్తులు ఆదివారం విరాళాలు అందజేశారు కృష్ణాజిల్లా కంకిపాడుకు చెందిన ఎల్ ఎల్. అన్నపూర్ణ ఆలయ అధికారులను కలిసి వనుకూరు వెంకట రమణ పేరిట రూ. 1,00,116, పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం బ్రాహ్మణపల్లి చెన్నాయబోడుకు చెందిన యార్లగడ్డ వెంకటేశ్వరరావు కుటుంబం రూ. 1,01,116 విరాళాన్ని అందజేసింది. దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను ఆలయ అధికారులు అందజేశారు.

గాయనీ గాయకుల సేవలు సదా స్మరణీయం



గాయకులు సుశీల్‌కుమార్, భారతీలను సత్కరించిన నిర్వాహకులు

విజయవాడ కల్చరల్: మధుర గాయనీ గాయకుల సేవలు సదా స్మరణీయమని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు అన్నారు. తెలుగు కళావాహిని, జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి, శ్రీ కళాభారతి ఆధ్వర్యాన గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం అమర గాయకుల స్ఫూర్తి కార్యక్రమం, సినీ సంగీత విభావరి నిర్వహించారు. చిట్టిబాబు మాట్లాడుతూ తెలుగు సినిమా చరిత్రను తిరగరాసిన గాయకులు చాలామందే ఉన్నారని వారిలో ఘంటసాల, బాల సుబ్రహ్మణ్యం, పీబీ శ్రీనివాస్, మాధవ పెద్ది సత్యం, భానుమతి లాంటి వారు ఎందరో ఉన్నారన్నారు. కళాపోషకుడు శింగంశెట్టి చంద్రశేఖర్, చెట్లపల్లి మారుతి ప్రసన్న, సంగీత విద్వాంసుడు కేవీ బ్రహ్మనందరావు ప్రసంగించారు. గాయకులు సుశీల్‌కుమార్, భారతీలను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు. సుశీల్‌కుమార్, డేవిడ్‌రాజు, ప్రిన్స్, కుమార్ గుప్తా, అయ్యప్పన్, స్వాతి, భారతి, రజని తదితరులు గీతాలు ఆలపించారు.

వైభవంగా లక్ష్మీతిరుపతమ్మ గ్రామోత్సవం



గౌడపేటలో అమ్మవారికి హారతులు పడుతున్న భక్తులు

గన్నవరం:లక్ష్మీతిరుపతమ్మ గ్రామోత్సవం గన్నవరంలో ఘనంగా కొనసాగుతోంది. ఈ నెల 16వ తేదీన నిర్వహించిన శ్రావణమాస ఉత్సవాలు అనంతరం లక్ష్మీతిరుపతమ్మ సమేత గోపయ్యస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేక పల్లకి వాహనంపై ఉంచి గ్రామోత్సవం ప్రారంభించారు. పాతగన్నవరం, చింతలపేట, రామ్‌నగర్, సొసైటీపేట, రాయ్‌నగర్ ప్రాంతాల్లో గ్రామోత్సవం కొనసాగింది. ఆదివారం ఉదయం నుంచి సగర్లపేట, యాదవులపేట, చెంచులకాలనీ, గౌడపేట, బుద్ధవరం రోడ్డు, శ్రీనగర్ కాలనీలో కొనసాగింది. తమ ఇళ్ల ముందుకు వచ్చిన అమ్మవారికి భక్తులు దర్శించుకుని హారతులు పట్టారు. డప్పువాయిద్యాలు, యువకుల కోలహాలం మధ్య గ్రామోత్సవం అత్యంత ఉత్సాహంగా సాగుతుంది. గ్రామోత్సవం సోమవారం తెల్లవారుజాముతో ముగుస్తుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ తెలిపారు. అనంతరం ఉత్సవమూర్తులు ఆలయానికి చేరుకుంటాయని చెప్పారు. అమ్మవారి శ్రావణమాస ఉత్సవం, ఊరేగింపు విజయవంతానికి సహకరించిన ఆలయ కమిటీతో పాటు భక్తులు, పోలీస్ శాఖకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

ఘనంగా గణపతి మందిరం నవీకరణ



పునఃప్రతిష్ట చేసిన గణపతి విగ్రహం



పూజలు చేస్తున్న భక్తులు

కంకిపాడు: మండలంలోని ప్రొద్దుటూరు శివారు గాయత్రీవిహార్‌లో గణపతి మందిరం నవీకరణ పనులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారి విగ్రహం పునః ప్రతిష్ట, కలశస్థాపన, లక్ష్మీ గణపతి, వాస్తు, పంచ సూక్త హోమాలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలను కమిటీ ప్రతినిధులు వెంకటేశ్వరరావు, పుష్పవతి, కె.నాగప్రసాద్, శ్యామల, జి.మురళీ మోహన్, ఓవిడి గణేష్, లక్ష్మీ పర్యవేక్షించారు. సమయంతుల నాగేంద్రం, శ్రీలక్ష్మీ దంపతులు స్వామి వారికి రూ 10,116 , బీ.లోహిత్‌కుమార్, గీత దంపతులు మకరతోరణం వితరణగా సమర్పించారు.

శ్రీమన్నారాయణ ఆశ్రమంలో రక్షాబంధన్ వేడుకలు



రక్షాబంధన్ వేడుకల్లో పాల్గొన్న మహిళలు

హనుమాన్‌జంక్షన్ రూరల్:బాపులపాడు మండలం వేలేరులోని శ్రీమన్నారాయణ ఆశ్రమంలో ధర్మరక్షా బంధన్ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలు పలువురు పాల్గొని ఒకరికొకరు రాఖీలు కట్టుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నాకు నువ్వు రక్ష.. నీకు నేను రక్ష.. మనమిద్దరం దేశానికి, ధర్మానికి రక్ష అంటూ సంకల్పం చేస్తూ రక్షాబంధన్ కట్టారు. సమరసత సేవా ఫౌండేషన్ గన్నవరం సబ్ డివిజన్ ప్రచారక్ యడవల్లి పాండు రంగారావు, మహిళా కన్వీనర్ దావులూరి రమాదేవి, సభ్యులు కల్వకుంట్ల లక్ష్మీ, హారతి పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు): క్రీడాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, తద్వారా ప్రభుత్వాల్లో కూడా మార్పు వస్తుందని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. రాఘవయ్య పార్కు సమీపంలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఆదివారం డీవైఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు పి.కృష్ణ అధ్యక్షతన క్రీడలపై చర్చాగోష్ఠి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఒలింపిక్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.పి.రావు, కబడ్డీ మహిళా ఇండియా కోచ్ పద్మజ బాల మాట్లాడుతూ.. ప్రపంచీకరణ యుగంలో శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఎంతో ప్రగతి సాధించామని, ప్రగతితో పాటు అంతే స్థాయిలో అసమానతలు కూడా పెరిగాయన్నారు. మనుషుల మధ్య వ్యాపార సంబంధాలే నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటలకు సరైన ప్రోత్సాహం లేక డ్రగ్స్‌కు, ఇతర చెడు అలవాట్లుకు యువత బలి అవుతుందన్నారు. ఈ నేపథ్యంలో అంతరించిపోతున్న క్రీడలను రక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. డ్రగ్స్ వద్దు-ఆటలు ముద్దు అనే నినాదంతో ముందుకు రావాలన్నారు.

జీవోలు పకడ్బందీగా అమలు చేయాలి..

యువత మత్తు పదార్థాలు విడిచి నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు వైపునకు రావాలని కోరారు. క్రీడలు పట్ల అటు ప్రభుత్వాలు, ప్రజలు అవగాహనతో వ్యవహరించాలని వారు సూచించారు. క్రీడకారులకు కనీసం రవాణా సౌకర్యం కూడా కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చదువుతో పాటు క్రీడల్లో కూడా మార్కుల విధానాన్ని పెట్టాలని సూచించారు. జీవో 63, స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు జీవో 74 పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. ఎన్టీఆర్ జిల్లా యూత్ సర్వీసు అధికారి శ్రీనువాసులు, కేబీఎన్ కాలేజీ ఫిజికల్ ఎడ్యుకేషన్ డీన్ డి.హేమచంద్ర, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవేంద్ర, ఫిజికల్ డైరెక్టర్ ఆఫ్ ఎస్‌ఆర్‌ఆర్-సీవీఆర్ కాలేజీ డి.యుగంధర్, బాస్కెట్‌బాల్ శాప్ కోచ్ సంతోష్, చెస్ కోచ్ రాజీవ్, డీవైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న తదితరులు పాల్గొని మాట్లాడారు.

మధురంగా సాగిన వయోలిన్ కచేరి



వయోలిన్‌పై కీర్తనలు పలికిస్తున్న అక్కరై సోదరీమణులు

విజయవాడ కల్చరల్: సంగీత విద్వాంసుడు పెమ్మరాజు సూర్యారావు జయంతి సందర్భంగా స్వరఝరి సంగీత సంస్థ ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని శివరామకృష్ణ క్షేత్రంలోని శ్రవణ సదనంలో ఆదివారం అక్కరై సోదరీమణులు ఎస్. సుబ్బలక్ష్మి, ఎస్. స్వర్ణలత నిర్వహించిన వయోలిన్ కచేరి మధురంగా సాగింది. సంగీత త్రిమూర్తులు త్యాగరాజ స్వామి, ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి కీర్తలను మధురంగా పలికించారు. కె. సాయి గిరిధర్ మృదంగంపై ఎమ్. హరిబాబు ఘటంపై వాయిద్య సహకారం అందించారు. స్వరఝరి కార్యదర్శి మాట్లాడుతూ సంగీత విద్వాంసుడు పెమ్మరాజు సూర్యారావు సుదీర్ఘ కాలం నగరంలోని సంగీత కళాశాలలో పనిచేశారన్నారు. ఆకాశవాణి విజయవాడ కేంద్రం ద్వారా వందలాది కార్యక్రమాలకు రూపకల్పన చేసినట్లు తెలిపారు. అక్కరై సోదరీమణుల సంగీత సేవలను కొనియాడారు. సంగీత విద్వాంసులు అంజనా సుధాకర్, వేమూరి విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణపై వివాదం

గన్నవరం: మండలంలోని సూరంపల్లిలో ప్రభుత్వ స్థలం ఆక్రమణపై ఆదివారం వివాదం చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం ప్రకారం...గ్రామానికి చెందిన ఉయ్యూరు ఆంజనేయులు ఆర్‌ఎంపీ వైద్యుడిగా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో గ్రామంలోని ఆయన ఇంటి పక్కన ఉన్న మూడు సెంట్లు బావి స్థలంలో నిర్మాణం చేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించాడు. దీని కోసం బావి స్థలంలో కంకర, ఇతర సామగ్రిని సిద్ధం చేశాడు. ఇది గమనించిన గ్రామస్తులు ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురికాకుండా కాపాడాలని ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు చేరుకుని విచారణ చేపట్టారు.